క్లుప్తంగా...

బోనాలకు భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పురుషోత్తమ్‌రావు, సురేష్ ముదిరాజ్

అబిడ్స్: బోనాల వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు, సురేష్‌ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం చందన్‌వాడి పరిసర ప్రాంతాల్లో పర్యటించి బోనాల వేడుకలను పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. గోషామహల్ పరిసర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, ఇతర శాఖల అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపడుతున్నారని పేర్కొన్నారు.

నేడు భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం

చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నామని కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ తెలిపారు. పాతబస్తీ గౌలిపురాలోని కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. చార్మినార్‌కు వెళ్లే ముందు కోట్ల అలీజాలోని కోట మైసమ్మ ఆలయం నుంచి భాజా భజంత్రీల నడుమ సామూహిక ఊరేగింపు కొనసాగుతుందన్నారు.

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్, విక్రమ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా సహా అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి విక్రమ్‌కుమార్‌లతో పాటు పలువురు నాయకులు ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. సోమవారం రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. చంద్రశేఖర్‌రాజు, రాజేందర్, గోపాల కృష్ణ, కృష్ణ, ఇబ్రహీం, అసద్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

దూద్‌బౌలి: రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని సర్కిల్–9 టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఈర్షద్ అన్నారు. సోమవారం ఫతేదర్వాజా నుంచి బారాగల్లీ వరకు రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా రెండు ఇళ్లకు నష్ట పరిహారాన్ని చెల్లించి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో దాదాపు రోడ్డు విస్తరణ కార్యక్రమం 80శాతం పూర్తయిందని..మిగతా వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు–20 ఎస్ఓలు నరేష్, మునావర్ అలీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురు సత్కారం

గన్‌ఫౌండ్రీ: గురువులను గౌరవించడం బాధ్యతతో కూడినదని కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యులు డాక్టర్ ఎస్పీ భారతి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో శ్రీ కూచిపూడి డ్యాన్స్ అకాడమి వ్యవస్థాపకురాలు డాక్టర్ విమల నీలంకు నాట్యభారతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ.. శాస్త్రీయ సంగీత నృత్య గురువులకు తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

నర్సులకు నైపుణ్య శిక్షణ తరగతులు



శిక్షణా తరగతులను ప్రారంభించిన డాక్టర్ నాగేందర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నర్సులు కూడా వారి వృత్తిలో నైపుణ్యతను అభివృద్ధి చేసుకునేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అన్నారు. తెలంగాణలోనే తొలిసారిగా కంటిన్యూయస్ నర్సింగ్ ఎడ్యుకేషన్ (సీఎన్ఈ) నైపుణ్య శిక్షణ తరగతులను ఉస్మానియాలో ప్రారంభించారు. సోమవారం ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ట్రెయిన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమం ఈనెల 16వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ విద్యులత, అడిషనల్ డైరెక్టర్ విజయనిర్మల, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, వైద్యులు పాండూ నాయక్, డాక్టర్ శేషాద్రి, సుజాతా రాథోడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో బోనాలకు ప్రపంచ గుర్తింపు



బోనాల చెక్కును అందజేస్తున్న మంత్రి తలసాని



మంత్రిని సన్మానిస్తున్న రాకేష్ తివారీ, ఆనంద్‌రావు

గోల్కొండ: బీఆర్ఎస్ హయాంలో బోనాలకు ప్రపంచ గుర్తింపు వచ్చిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్ నియోజకవర్గంలోని ఝూంసింగ్ ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన బోనాలు నిర్వహించే ఆలయాల వారికి ప్రభుత్వం తరపున మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో బోనాలు నిర్వహించడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారన్నారు. బోనాల నిర్వహణకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కార్వాన్ నియోజకవర్గం మొత్తం రూ.2.13 కోట్లు వివిధ ఆలయాల వారికి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాశ్, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

మంత్రి తలసానికి సన్మానం

చార్మినార్: పాతబస్తీలోని అమ్మవారి ఆలయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందజేస్తున్నందుకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ, గౌలిపురా కోట మైసమ్మ ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావులు ధన్యవాదాలు తెలిపారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాతబస్తీలో చెక్కుల పంపిణీకి వచ్చిన ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

స్వచ్ఛమైన గాంధేయవాది మల్లికార్జున శర్మ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఉప్పలూరి మల్లికార్జున శర్మ నిరాడంబరత నైతిక విలువలు పాటించే స్వచ్ఛమైన గాంధేయవాది అని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో జానకి మల్లికార్జున చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్లికార్జున శర్మ 85వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. మద్యపాన నిషేధం అమలు కోసం ఎంతగానో పోరాడారని పీవీ నర్సింహారావుకు అత్యంత అభిమాన పాత్రుడు అని గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు హరిచంద్రరాయల్‌కు మల్లికార్జున శర్మ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, సీనియర్ జర్నలిస్టు సూర్యప్రకాష్, నిర్వాహకులు ఉప్పలూరి శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అధిక ప్రాధాన్యం

గన్‌ఫౌండ్రీ: రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ అన్నారు. తమ పార్టీ బీసీలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. సోమవారం తాజ్‌మహల్ హోటల్‌లో జరిగిన బీసీ రాజకీయ జాగృతి సమావేశానికి ఆయన హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు న్యాయం చేయాలని కోరారు.

సప్త మాతృక ఆలయంలో బోనాలకు ఏర్పాట్లు పూర్తి



శ్రీహరి

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ అశోక్‌నగర్‌లోని సప్త మాతృక ఆలయంలో ఈ ఏడాది బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వి.శ్రీహరి తెలిపారు. సోమవారం ఆయన బోనాల ఉత్సవాల వివరాలు వెల్లడించారు. 16న జరిగే బోనాల ఉత్సవాల్లో ఉదయం నుంచే అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందన్నారు. అదేరోజు సాయంత్రం పలహారపు బండి ఊరేగింపు కొనసాగుతుందన్నారు. 19 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ పలహారపు బండి ఊరేగింపులో కళాకారుల వేషధారణలు, డప్పు చప్పుళ్ల కోలాహలం ఉంటుందన్నారు. 17న తొట్టెల ఊరేగింపు ఉంటుందన్నారు. వైస్ చైర్మన్ వి.సత్యనారాయణ, అధ్యక్షుడు గణేష్, కోశాధికారి జ్ఞానేశ్వర్, సభ్యులు వి.నాగరాజు, టింకు, కె.సురేష్ సమన్వయంతో బోనాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు.

'చలాన్ల పేరిట వేధింపులు'



హోంమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: హైదరాబాద్‌లో యువకులను, విద్యార్థులను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు చలాన్ల పేరిట వేధిస్తున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ హోంమంత్రి మహమూద్ అలీకి ఫిర్యాదు చేశారు. సోమవారం హోంమంత్రికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉదయం పూట చలాన్ల పేరుతో ట్రాఫిక్ పోలీసులు, రాత్రిపూట లా అండ్ ఆర్డర్ పోలీసులు విద్యార్థులు, యువకులను పలు రకాలుగా వేధిస్తున్నారన్నారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సమస్యలపై దృష్టిపెట్టకుండా కేవలం చలాన్లపైనే దృష్టిపెట్టారన్నారు. ఎవరిని వేధించకుండా పోలీసుకు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా హోంమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందుకుమార్, అహ్మద్, గౌస్, మహ్మద్ సలీమ్, మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ పైనుంచి దూకిన ప్రేమికుడు

- యువకుడికి తీవ్రగాయాలు
- ప్రేమను కుటుంబ సభ్యులు అంగీకరించపోవడంతో దారుణం

ఫిలింనగర్: ప్రేమించిన యువతిని మర్చిపోవాలని ఇంటికి పిలిచి యువతి బంధువులు కొట్టడంతో పాటు బెదిరించడంతో ఓ యువకుడు బిల్డింగ్‌పై నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. టోలిచౌకి మినీ జానకీనగర్‌కు చెందిన యువతి(21)ని జీషన్(19) అనే యువకుడు కొంత కాలంగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన ఇరుకుటుంబసభ్యులు మాట్లాడుకొని వీరి ప్రేమను అంగీకరించకుండా ఒకరిని ఒకరు కలుసుకోవద్దని షరతులు పెట్టారు. ఈనెల 8న జీషన్ తాను ప్రేమించిన యువతితో కనిపించడంతో ఈ విషయాన్ని యువతి తల్లికి చేరవేశారు. ఆదివారం రాత్రి జీషన్‌ను యువతి కుటుంబసభ్యులు తమ ఇంటికి పిలిపించారు. కూతురితో ఎందుకు తిరుగుతున్నావంటూ తల్లి ప్రశ్నించగా తీవ్ర గొడవ జరిగింది. ఈ నేపథ్యంలోనే యువతి బంధువు తన బైక్ తాళం చెవులతో జీషన్‌పై దాడికి దిగడంతో తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు కొట్టేందుకు యత్నిస్తుండగా జీషన్ రెండో అంతస్తు నుంచి కిందకు దూకడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. జీషన్ తల్లి షాహిన్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు యువతి బంధువులపై ఐపీసీ సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులను వేగవంతం చేయాలి



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ అలీ బేగ్, కార్పొరేటర్లు, అధికారులు

యాకుత్‌పురా: పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ అలీ బేగ్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన రెయిన్‌బజార్, పత్తర్‌గట్టి కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ పలు విభాగాల అధికారులతో కలిసి పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. యాకుత్‌పురా, రెయిన్‌బజార్, మౌల్లా కా చీల్లా, గంగానగర్, అమన్‌నగర్–ఏ, జహంగీర్‌నగర్ తలాబ్ కట్టా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కొన్ని రోజులుగా కొనసాగుతున్న నాలా విస్తరణ పనులపై అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో సమస్యలు తలెత్తకుండా నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. ఈ పర్యటనలో స్థానిక మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్ఎంసీ, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎస్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

19 షాప్‌ల బహిరంగ వేలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

చార్మినార్: 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలోని వెల్ఫేర్ అసోసియేషన్ పిల్లి గుడిసెలు ఆధ్వర్యంలో 19 షాప్‌లకు సోమవారం వేలం జరిగింది. డబుల్ బెడ్‌రూం నెల వారి మెయింటెనెన్స్ కోసం జీహెచ్ఎంసీ హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మించిన షాప్‌లకు ఓపెన్ ఆక్షన్ జరిగింది. ఈ ఓపెన్ ఆక్షన్‌లో మలక్‌పేట్ ఎమ్మెల్యే బలాలతో పాటు కార్పొరేటర్ అబ్దుల్ సలాం షహీద్, మాజీ కార్పొరేటర్ ముర్తుజా అలీ, జీహెచ్ఎంసీ హౌసింగ్ విభాగం ఈఈ వెంకటదాస్ రెడ్డి, డీఈ గంగాధర్, ఏఈ మహేష్, రఘురాం, ప్రవీణ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్–6 ఏఈ మల్లికార్జున్, సైదాబాద్ తహసీల్దార్ వేణుగోపాల్, హరిబాబు పాల్గొని షాప్‌లను వేలం వేశారు. ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ.. వేలంలో షాప్‌లు పొందిన కిరాయిదారులు ప్రతినెలా తప్పనిసరిగా నెల అద్దె చెల్లిస్తూ అసోసియేషన్ నిబంధనలను పాటించాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు మస్తాన్, పిల్లి గణేష్, మన్సూర్, తాహెర్, యూసుప్ పాల్గొన్నారు.

క్రీడా అకాడమీలకు ప్రోత్సాహం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ ఆంజనేయగౌడ్

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా అకాడమీలకు ప్రోత్సాహం ఇస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు. సోమవారం ఆయన ఎల్బీస్టేడియంలో క్రీడా అకాడమీలు, క్రీడా పాఠశాలలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యాసంస్థల్లో నిరంతర క్రీడా కార్యక్రమాలకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అకాడమీల నిర్వహణపై నిరంతరం పర్యావేక్షించాలని అధికారులకు సూచించారు. క్రీడల్లో మెరుగైన ఫలితాలను సాధించే దిశగా దృష్టి సారించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఓఎస్‌డీ డాక్టర్ కె.లక్ష్మీ, డిప్యూటీ డైరెక్టర్ జి.చంద్రారెడ్డిలతో పాటు పలు క్రీడా అకాడమీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న వడ్డెర, బంజారా, సంచార జాతుల సంఘం అధ్యక్షుడు రాజు

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలని జాతీయ వడ్డెర, బంజారా, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేలంకి రాజు డిమాండ్ చేశారు. సోమవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ–ఏ జాబితాలో ఉన్న వడ్డెరలతో పాటు 36 సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం సలహాదారు, మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత రవీంద్రనాయక్ మాట్లాడుతూ.. జాతీయ వడ్డెర, బంజారా, సంచార జాతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్‌రాథోడ్, ఉపాధ్యక్షుడు రవి నాయక్ పాల్గొన్నారు.

నగరంలోని మోజాంజాహీ మార్కెట్ సమీపంలో డ్రైనేజీలు పొంగుతుండటంతో మురుగు రోడ్లపై ఏరులై పారుతోంది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గుర వుతున్నారు. ప్రధాన రహదారిలో మురుగు ముంచెత్తినా పట్టించుకునే నాథులే లేరని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగు సమస్యకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. – సాక్షి, సిటీబ్యూరో



మురుగుమయం.. అధికారుల చోద్యం..

సోండి కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలి



కిషన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కదంబాల జీవనరావు

నాంపల్లి: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన జి.కిషన్‌రెడ్డిని రాష్ట్ర సోండి కుల సంక్షేమ సంఘం నేతలు కలిసి సత్కరించారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను కలిసి ఎన్నో ఏళ్లుగా బీసీ–డీ జాబితాలో కొనసాగుతున్న సోండి కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చమని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, కేంద్ర ఎన్సీబీసీ చైర్మన్‌కు సిఫారసు చేస్తూ సోండి కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలంగాణ సోండి కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కదంబాల జీవనరావు తెలిపారు. ప్రధాన కార్యదర్శి రత్నాల మురళి, ఉపాధ్యక్షులు గజరావు నాగరాజు, కోశాధికారి కదంబాల ధర్మరాజు, సహ కార్యదర్శి కదంబాల సురేష్ కుమార్ పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి



వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి మంజూరైన నిధులతో వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. ఆస్పత్రి రోడ్లు తదితర వాటికి మంజూరైన పనుల విషయంపై సోమవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో ఆస్పత్రి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.1.30 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అయితే తెలంగాణ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈఈ రాజేందర్‌తో మాట్లాడి పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూస్తానన్నారు. ఈ ఆస్పత్రికి మరిన్ని నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ రవూఫ్ ఉద్దీన్, ఏఓ శ్రీనివాసరాజు తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్.ఎం.హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కె.ఆర్.రాజ్‌కుమార్

నాంపల్లి: హైదరాబాద్ జిల్లా విద్యా శాఖలో నెలకొన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేన్ అన్నారు. ఈ మేరకు నాంపల్లిలోని టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో పాఠశాల విద్యా శాఖ యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ నేతృత్వంలో విద్యాశాఖలో మిడ్ డే మీల్స్ పోస్టుల భర్తీ, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా విద్యా శాఖలో 2004 అనంతరం అపాయింట్‌మెంట్ అయిన 150 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి తీసుకురావాలనే విషయాలపై టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని డాక్టర్ ఎస్.ఎం. హుస్సేన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా నేతలు వైదిక్ శస్త్ర, శంకర్, డీఈఓ యూనిట్ నేతలు ప్రేమ్‌కుమార్, ముజాహిద్, ప్రియాదేవ్ ఠాకూర్, యోగేందర్, సూర్య, జాంబయ్య, అజీజ్, అన్వర్, పరమేష్, జమీల్, శ్రీకాంత్, ప్రవీణ్, దామోదర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు నల్లపోచమ్మ కల్యాణం



బ్రోచర్ విడుదల చేస్తున్న ఆలయ ప్రతినిధులు

జియాగూడ: ఇందిరానగర్‌లో నల్లపోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం మాతేశ్వరీ కల్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి ఎం.రఘుపతి, అధ్యక్షులు టి.యాదయ్య, కార్యదర్శి ఎం.నాగరాజ్, కోశాధికారి జె.లక్ష్మీనారాయణ, ఎం.బాలకృష్ణ, ఎస్.అనిల్‌కుమార్ తదితరులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆలయ ప్రాంగణంలో బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ వేడుకలు నల్లపోచమ్మ, ముత్యాలమ్మ ఆలయ కమిటీ, ఆదిజాంబవ సంక్షేమ సంఘంల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మంగళవారం ఒగ్గువారిచే మైలపోల్ పోజ, గంగతెప్ప, ఉదయం 11 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవం, పటం, ఘటం పూజ, అమ్మవారి కథ ఒగ్గువారిచే నిర్వహించడం జరుగుతుందన్నారు.

భక్తి శ్రద్ధలతో బోనాలు



వేడుకల్లో మహేష్కర్ కాంతిలాల్ తదితరులు

జియాగూడ: సంత్ రవిదాస్ మోచి సమాజ్ సేవా సంఘం ద్వారా ప్రతిఏటా బగిచా బోనాలు నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర సంత్ రవిదాస్ మోచి సమాజ్ సేవా సంఘ ప్రధాన కార్యదర్శి మహేష్కర్ కాంతిలాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం గండిపేటలో జియాగూడ తదితర ప్రాంతాలకు చెందిన మోచి సమాజ్ బగీచా బోనాలను ఘనంగా నిర్వహించారు. సమాజ్ ప్రతినిధులు మనోహర్ పుర్వే, వినోద్ కుమార్ దయాల్, మహోరే మనోహర్ లాల్, నర్సింగ్‌రావు, ముఖేష్, ఉమేష్, తేజస్ పాల్గొన్నారు.



వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో..

లంగర్‌హౌస్: ఇబ్రహీంబాగ్‌లోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పోతరాజులు, డప్పు వాయిద్యాలతో వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ ఉత్సవాల్లో వాసవీ ఎడ్యుకేషన్ అకాడమీ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రావు, బాలాజీ, సల్లు, అశోక్, నందగోపాల్, నరహరి, రవీందర్‌కుమార్, కేవీ సుబ్బారావు, నర్సింగ్, వెంకటేష్ హెచ్‌ఓడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సంపూర్ణ చతుర్వేద పారాయణం

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో సంపూర్ణ చతుర్వేద పారాయణం పూజా కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ ఈనెల 14వ తేదీ వరకు రోజుకో పారాయణం పూర్తవుతుందని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. సోమవారం అంకురార్పణ, రుత్వీకరణం, కలశస్థాపన, వేధారాదన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి అలంకార బ్రహ్మ శ్రుంగారం ఆత్రేయాచార్యులు తెలిపారు.



సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకిలోని తన కార్యాలయంలో ఆయన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు పథకానికి అవసరమైన ధ్రువపత్రాలు తప్పనిసరిగా జత చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని ఖాజిపురాలో 11కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్న సమస్యపై 'ట్రాన్స్‌కో..మేలుకో..' అనే శీర్షికపై 'సాక్షి'లో వచ్చిన వార్త కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా సోమవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ చందులాల్ బారాదరి ఏఈ షబ్బీర్ అహ్మద్ ఖాజిపురాలో ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ వైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాజిపురాలో వేలాడుతున్న విద్యుత్ వైరు పరిశీలించామని.. దీనికి స్థానికంగా విద్యుత్ పోల్‌ను ఏర్పాటుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ వైరు సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.



పరిశీలిస్తున్న ఏఈ షబ్బీర్ అహ్మద్